నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, గురువారం 10 ఏప్రిల్ 2025 | PEDDAPALLI






హనుమాన్ దీక్షాపరులకు వందనం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# ఆధ్యాత్మిక సేవలో రామన్న



హనుమాన్ దీక్షాదారులతో కలిసి సహపంక్తి భోజనం(భిక్ష) చేస్తున్న కేటీఆర్

- సిరిసిల్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన
- తెలంగాణ భవన్‌లో హనుమాన్ పూజకు హాజరు
- దీక్షాపరులతో కలిసి సహపంక్తి భోజనం
- గంభీరావుపేటలో పెద్దమ్మ తల్లి, మల్కపేట సీతారామచంద్ర స్వామి ఆలయాల్లో పూజలు
- ప్రజలందరినీ చల్లంగ చూడాలని ఆకాంక్ష

సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల రూరల్/ కోనరావుపేట/ గంభీరావుపేట, ఏప్రిల్ 9 : ఎప్పుడూ ప్రజా ఉద్యమాలతో బిజీగా ఉండే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బుధవారం ఆధ్యాత్మిక సేవలో తరించారు. సిరిసిల్లలో రోజంతా బిజీబిజీగా గడిపారు. మొదట జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన హనుమాన్ పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, పూజలు చేశారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ దీక్షా పరులతో కలిసి సహపంక్తి భోజనం(భిక్ష) చేశారు. సుమారు రెండు గంటల పాటు భజన, పూజాది కార్యక్రమాల్లో పాల్గొనడంతో స్వాములు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుంచి వెయ్యి మందికి పైగా స్వాములు తరలిరాగా, కేటీఆర్ ఆప్యాయంగా పలుకరించారు. అనంతరం ఆయనకు శ్రీరాముడి చిత్రపటం బహూకరించారు. ఆ తర్వాత కోనరావుపేట మల్కపేటలో మాజీ న్యాయ శాఖ మంత్రి చల్మెడ ఆనందరావు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి పూజలు చేయగా, అర్చకులు ఆశీర్వదించారు. బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు కండువా కప్పి సత్కరించారు. అనంతరం



గంభీరావుపేట : పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కోనరావుపేట : మల్కపేట శ్రీసీతారామ చంద్ర స్వామి ఆలయం వద్ద పూర్ణకుంభంతో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న వేద పండితులు

కేటీఆర్ అక్కడి నుంచి గంభీరావుపేటకు వెళ్లారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి కట్న కానుకలు సమర్పించారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని, అమ్మవారు అందరినీ చల్లంగా చూడాలని కోరుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కేటీఆర్‌ను సన్మానించారు. సిరిసిల్లలో కేటీఆర్ వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఏనుగు మనోహర్‌రెడ్డి, బొల్లి రామ్మోహన్, ఒజ్జల అగ్గిరాములు, కుంబాల మల్లారెడ్డి, పడిగెల రాజు, కొమిరిశెట్టి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి నుంచి రావాలి

- వరంగల్ సభకు స్వచ్ఛందంగా కదలాలి
- ఆరు గ్యారెంటీలపై నాయకులను నిలదీయాలి
- పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్



కన్నాలలో వరంగల్ బహిరంగ సభ వాల్‌రైటింగ్ రాస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ పుట్టమధూకర్

పాలకుర్తి, ఏప్రిల్9: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఇంటింటి నుంచీ తరలిరావాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కదలాలని జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను నట్టేట ముంచారని, ఆరు గ్యారెంటీల అమలుపై ఆ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని కోరారు. పాలకుర్తి మండలం కన్నాలలో బుధవారం ఆయన 'వరంగల్ సభ' వాల్‌రైటింగ్ రాయించారు. అనంతరం కన్నాలలో రాణాపూర్, భామ్లనాయక్‌తండా, జీడీనగర్, కన్నాల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. వరంగల్ సభకు రైతులు, మహిళలు, విద్యార్థులు, యువకులు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సభలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, కాంగ్రెస్ చేస్తున్న మోసాల గురించి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు వివరించి చైతన్యం చేస్తారని చెప్పారు. అలాగే పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తారని తెలిపారు. నాడు కేసీఆర్ మొక్కవోని దీక్షతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దేశంలోనే అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. కానీ, కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే మళ్లీ బీఆర్ఎస్ రావాల్సిన అవసరముందని చెప్పారు. అనంతరం శాలపల్లిలోని నూతన దేవాలయంలో ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆదెపుశ్రీనివాస్, ఎంపఅతిక్, ఖదార్‌పాషా, రజియాబేగం, సతీశ్, బూర్ల శ్రీహరి, కుదిరే సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## బిడ్డను చంపి తల్లి ఆత్మహత్య



కూతురు రితన్యరెడ్డితో లోక సాహితి

పెద్దపల్లి టౌన్/జూలపల్లి, ఏప్రిల్ 9: ఆ తల్లికి ఏ కష్టం వచ్చిందో ఏమో కానీ, మూడేండ్ల కూతురును చంపి, ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన పెద్దపల్లిలో విషాదాన్ని నింపింది. ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి మండల కేంద్రానికి చెందిన లోక వేణుగోపాల్‌రెడ్డి తన భార్య సాహితీతో కలిసి పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరికి నాలుగేండ్ల క్రితం వివాహం కాగా, కూతురు రితన్యరెడ్డి(3) ఉన్నది. వేణుగోపాల్‌రెడ్డి ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాహితీ తన బిడ్డ రితన్యరెడ్డిని చంపి, ఆ తర్వాత ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకున్నది. మృతదేహాలను ప్రభుత్వ దవాఖానకు తరలించి పంచనామా చేశారు. కాగా, ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉన్నదని, ప్రాథమికంగా అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లలో మళ్లీ దళారీ దందా!

- సర్కారు నిర్లక్ష్యం.. రైతులకు శాపం
- కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం
- అప్పుడే గద్దల్లా దళారులు
- పొలాల వద్దే కొనుగోళ్లు
- సెంటర్లు ఓపెన్‌కాక అగ్గువకే అమ్ముకుంటున్న అన్నదాతలు
- నేటి నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు అధికారుల ప్రకటన
- ఎక్కడనేది వెల్లడించకపోవడంతో రైతుల్లో గందరగోళం



ధాన్యం కొనుగోళ్లలో మళ్లీ దళారుల దందా మొదలైంది. కోతలు మొదలయ్యాయో లేదో.. అప్పుడే దోపిడీకి తెరలేస్తున్నది. కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వ జాప్యాన్ని ఆసరాగా తీసుకొని, కల్లాల వద్దే కాంటాలు పెడుతూ అగ్గువకే ధాన్యం కొంటున్నట్టు తెలుస్తున్నది. సెంటర్లు ఓపెన్ కాక తప్పనిపరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. ఒక పక్క గురువారం నుంచి కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు అధికారులు చెబుతున్నా.. ఐకేపీ మాత్రం సిద్ధంకానట్లు తెలుస్తున్నది. డీఆర్‌డీఏ ఆఫీసర్లు తమ సిబ్బందికి ఇప్పటివరకు శిక్షణ కూడా ప్రారంభించకపోగా, సివిల్ సప్లయ్స్‌వాళ్లు మాత్రం కేంద్రాలు ఓపెన్ చేస్తున్నట్టు చెప్పుకోవడం అనుమానంగానే ఉన్నది.

హుజూరాబాద్ మండలం ఇప్పల నర్సింగాపూర్‌లో వరి కోస్తున్న హార్వెస్టర్

కరీంనగర్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో ఎవుసం ఆగమైంది. ప్రస్తుతం ప్రభుత్వ ప్రణాళికాలోపంతో సాగునీటి సమస్య వెంటాడుతున్నది. ఇప్పటికే సాగునీరందక వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చే దశలో ఎండిపోతున్నాయి. కనీసం చేతికి వచ్చిన పంటకైనా మద్దతు ధర చెల్లించి సకాలంలో కొనుగోలు చేస్తారని ఆశించిన రైతులకు ఇక్కడా నిరాశే ఎదురైంది. గత సీజన్ మాదిరిగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతున్నదని రైతులు ఆరోపిస్తున్నారు. నిజానికి జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. కోతలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో గుర్తించి అక్కడక్కడ అధికారులు ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సిన అవసరమున్నది. కానీ, ఇప్పటి వరకు కేంద్రాలు ప్రారంభించ లేదు. రైతులు కేంద్రాల్లో ధాన్యం పోసి ఎదురు చూస్తున్నారు. గంగాధర వ్యవసాయ మార్కెట్‌లో అయితే కుప్పలు కుప్పలుగా ధాన్యం పోసిన రైతులు రాత్రి, పగలు అక్కడే కాపలా కాస్తున్నారు. ఈ ప్రాంతంలో వారం రోజులుగా కోతలు జరుగుతున్నా అధికారులు ఇప్పటి వరకు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. గత యాసంగిలో కూడా ఇలాగే కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జరిగిన జాప్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. అగ్గువకే దళారులకు విక్రయించి కనీస మద్దతు ధరతోపాటు సన్నవడ్లకు ₹500 బోనస్ కూడా పొంద లేకపోయారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఇలా వ్యవహరించిందనే విమర్శలు వచ్చాయి. గత సీజన్‌లో దాదాపు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు అగ్గువ ధరకే దళారులకు అమ్ముకున్నట్టు తెలుస్తున్నది.



గంగాధర వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యపురాశులు

### ఈ సీజన్‌లోనూ అదే దుస్థితి

ప్రస్తుత యాసంగి సీజన్‌లో కూడా అదే దుస్థితి కనిపిస్తున్నది. వారం నుంచి కోతలు ప్రారంభమైనా అధికారులు ఇప్పటి వరకు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. కలెక్టర్ మినహా మంత్రులు కూడా ఇప్పటి వరకు ధాన్యం సేకరణపై సమీక్షించి దిశానిర్దేశం చేయలేదు. ఫలితంగా ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకం కోల్పోతున్న రైతులు, తక్కువ ధరకైనా సరే దళారులకు విక్రయించాలనే ఆలోచనకు వస్తున్నారు. కనీస మద్దతు ధర ఏ గ్రేడు ధాన్యం క్వింటాల్‌కు ₹2,320, సాధారణ రకానికి ₹2,300 నిర్ణయించగా, దళారులు మాత్రం ₹1,800 నుంచి ₹1,850కే కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్లనైతే ₹1,750కే రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. గంగాధర మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఈ దందా అడ్డూఅదుపు లేకుండా నడుస్తున్నది. చొప్పదండి, కరీంనగర్ రూరల్, మానకొండూర్, తిమ్మాపూర్, గన్నేరువరం, చిగురుమామిడి, సైదాపూర్ తదితర ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే కోతలు ముమ్మరం అవుతున్నాయి. ఇక్కడ కూడా ఇప్పటి వరకు కేంద్రాలు తెరువలేదు. ఈ ప్రాంతాలపైనా దళారులు కన్నేసినట్టు తెలుస్తున్నది. ఇక హుజూరాబాద్ డివిజన్‌లో చూస్తే ఎక్కువగా యాసంగిలో సీడ్ వడ్లు సాగు చేస్తారు. ఈ ప్రాంతంలో మరో వారం అయితే సన్న రకాలు కోతకు వచ్చే అవకాశముంటుంది. అప్పటి వరకు ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేయకుంటే దళారుల జోక్యం పెరిగే ముప్పు ఉన్నది. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు తెరవకపోతే ఈ సారి కూడా రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తున్నది.

### నేటి నుంచి కేంద్రాలు తెరిచేనా..?

ఈ యాసంగి సీజన్‌లో కరీంనగర్ జిల్లాలో సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందులో సీడ్, తిండి కోసం తీసివేస్తే కేంద్రాలకు 3.50 లక్షల మెట్రిక్ టన్నులు రావచ్చని అధికారులు భావిస్తున్నారు. 338 కేంద్రాల ద్వారా ఈ ధాన్యం కొనుగోలు చేయాలని భావించి, గురువారం నుంచి అన్ని కేంద్రాలు తెరిచి ఉంచుతామని చెబుతున్నారు. కానీ, ఎక్కడ ప్రారంభిస్తారు? ఎవరు ప్రారంభిస్తారనే విషయంలో మాత్రం అధికారుల వద్ద సమాధానం లేదు. గత ఆఖరి సీజన్ వరకు కూడా ఐకేపీకి కేవలం 48 కేంద్రాలు మాత్రమే జిల్లాలో కేటాయించేది. సింగిల్ విండోలకు 239 కేంద్రాలు ఉండేవి. కానీ, వాటికి కేటాయించిన కేంద్రాల సంఖ్యను తగ్గించి ఐకేపీకి 150 కేంద్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, గత నెల 28న కలెక్టర్ పమేలా సత్పతి సమీక్షా సమావేశం నిర్వహించి, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, అన్ని వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ఐకేపీ ద్వారా ఇప్పటి వరకు సిబ్బందికి ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. కానీ, కేంద్రాలు మాత్రం తెరుస్తామని అధికారులు చెప్పడంలో ఆంతర్యం ఏమిటనేది అర్థంకాని పరిస్థితి. కొనుగోలు కేంద్రాలు ఎక్కడెక్కడ ప్రారంభిస్తున్నారని నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, వారు అందుబాటులో లేరు. అయితే కోతల వెంటనే కొనుగోళ కేంద్రాలను ప్రారంభించి, కొనుగోళ్లు చేస్తేనే దళారుల దందాకు చెక్ పడుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# సభకు దండుగా కదులుదాం



రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, నాయకులు



కురిక్యాలలో సన్నాహక సమావేశానికి హాజరైన కార్యకర్తలు

- విజయవంతం కోసం కలిసికట్టుగా పనిచేద్దాం
- చొప్పదండి నియోజక వర్గం నుంచి 10 వేల మందిని తరలిద్దాం
- బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపు
- చొప్పదండి నియోజకవర్గ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం

గంగాధర, ఏప్రిల్ 9: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు దండుగా కదులుదామని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని, లక్ష్యం మేరకు సభకు జనాన్ని తరలించి విజయవంతం చేద్దామని నిర్దేశం చేశారు. గంగాధర మండలం కురిక్యాల పరిధిలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో బుధవారం చొప్పదండి నియోజకవర్గ స్థాయిలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్నింటా విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గుర్తించారని చెప్పారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని భరోసానిచ్చారు. రజతోత్సవ సభకు చొప్పదండి నియోజకవర్గం నుంచి 10 వేల మందిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయి నాయకుల నుంచి గ్రామ స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి సభకు తరలుదామన్నారు. ప్రతి గ్రామంలో జెండా గద్దెలకు రంగు వేయించాలని, రజతోత్సవ సభ వాల్ రైటింగ్ జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు దూలం బాలగౌడ్, పునుగోటి కృష్ణారావు, సాగి మహిపాల్‌రావు, కొడంపల్కల రామ్మోహన్‌రావు, నాగి శేఖర్, మేచినేని నవీన్‌రావు, కత్తెరపాక కొండయ్య, జనగం శ్రీనివాస్, మాచెర్ల వినయ్, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, పులి వెంకటేశ్ గౌడ్, బందారపు అజేయ్‌కుమార్, ఆకుల మధుసూదన్, కంకణాల విజేందర్‌రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, దూలం శంకర్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయ్యో 'పాప'ం

## బంధువుల ఇంటికి వచ్చి బావిలో పడి చిన్నారి మృతి



గడ్డం జశ్విత(ఫైల్)

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 9: మూడేళ్లకే నూరేళ్లు నిండాయి. అత్తింటికి వచ్చి ప్రమాదవశాత్తూ బావిలో పడగా, ఆ చిన్నారి ప్రాణాలు గాల్లో కలిశాయి. విషయం తెలిసిన తల్లిదండ్రులు అక్కడకు చేరుకొని గుండెలు బాదుకున్నారు. 'ఆ దేవుడు ఎంత పనిచేసే బిడ్డా..' అంటూ కన్నీరుమున్నీరుగా రోదించారు. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లికి చెందిన గడ్డం అజేందర్ రెడ్డికి ఇద్దరు కూతుళ్లు. మూడు రోజుల క్రితం కరీంనగర్ మండలం బహ్దూర్‌ఖాన్‌పేటకు చెందిన ఆయన అక్కా బావ మంజుల, రాజిరెడ్డి బొమ్మారెడ్డిపల్లికి వచ్చారు. వెళ్లే ముందు అజేందర్‌రెడ్డి పెద్ద కూతురు జశ్విత (3)ను తమ వెంట తీసుకెళ్లారు. బుధవారం ఉదయం బహ్దూర్‌ఖాన్‌పేటలోని వారి వ్యవసాయ పొలం వద్దకు మంజుల, రాజిరెడ్డితోపాటు కొడుకు అభిరామ్‌రెడ్డి వెళ్లారు. వెంట జశ్వితను కూడా తీసుకెళ్లారు. పొలం వద్ద ఉన్న చెట్టు కిందే చిన్నారి చాలాసేపు ఆడుకున్నది. అయితే చెట్టు కొట్టేసేందుకు కూలీలు రాగా, అడ్డుగా ఉన్న ట్రాక్టర్‌ను అభిరామ్‌రెడ్డి పక్కకు తీసే క్రమంలో చిన్నారిని వాహనం ముందు భాగంలో ఎక్కించుకున్నాడు. కాస్త ముందుకు వెళ్లి బావి ముందు రెండో గేర్‌లోనే ట్రాక్టర్‌ను ఆఫ్ చేసి, తాళం అలాగే ఉంచి కిందికి దిగి పని నిమిత్తం పక్కకు వెళ్లిపోయాడు. అయితే జశ్విత కీని ఆన్ చేయడంతో ట్రాక్టర్ ముందుకు వెళ్లి బావిలో ఆమెతో సహా పడిపోయింది. సమాచారం మేరకు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు. అభిరామ్ నిర్లక్ష్యంతోనే తన కూతురు మృతిచెందిందని తండ్రి అజేందర్ రెడ్డి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.